సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 3 । డిసెంబర్ । 2024



వరి రైతు అప్రమత్తం !
ఫెంగల్ తుపాను ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వరి రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. - 8లో



మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు
మోసానికి బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి చంద్రబాబు అని మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా పేర్కొన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
29.2 /24.3

వాతావరణం
జిల్లాలో సోమవారం 24.3 - 29.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

5న టేబుల్ టెన్నిస్ పోటీలు

వైవీయూ : యోగి వేమన విద్యాలయం అంతర కళాశాలల టేబుల్ టెన్నిస్ పోటీలు ఈ నెల 5వ తేదీన నిర్వహించనున్నట్లు వైవీయూ క్రీడా బోర్డ్ కార్యదర్శి డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2024 సంవత్సరం జూలై 7వ తేదీ నాటికి 17 సంవత్సరాలు నిండి 25 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలలో చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. పాల్గొనే క్రీడాకారులు పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్లు, మిగతా అన్ని సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలు, ఎలిజిబిలిటీ ఫామ్‌తో హాజరుకావాలని సూచించారు.

జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్ : ఫెంగల్ తుపాను కారణంగా జిల్లాలో రెండోరోజు కూడా వర్షాలు కొనసాగాయి. ఆట్లూరులో 17.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చక్రాయపేటలో 15.8, ఒంటిమిట్టలో 14.4, వేంపల్లిలో 14, కాశినాయనలో 9, సికెదిన్నెలో 7.8, సిద్దవటంలో 7.6, గోపవరంలో 7.4, పోరుమామిళ్లలో 6.8, కలసపాడులో 6.4, బద్వేల్‌లో 5.2, కడపలో 4.4, వేములలో 4, సింహాద్రిపురంలో 3.6, ఖాజీపేటలలో 3.4, బిమఠంలో 2.4, పులివెందుల్లో 3, మైలవరం, కమలాపురంలో 2.4, వీఎన్‌పల్లి, పెండ్లిమర్రిలలో 2.2, చెన్నూరు, రాజుపాలెంలలో 1.6, వల్లూరులో 1.4, పెద్దముడియం జమ్మలమడుగు, ఎర్రగుంట్లలలో 1.2, ప్రొద్దుటూరులో 1 ఎంఎం, కొండాపురంలో 0.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

8న ఆన్‌లైన్‌లో క్రీడా జ్ఞాన్ పరీక్ష

కడప స్పోర్ట్స్ : క్రీడాభారతి కార్యక్రమంలో భాగంగా డిసెంబర్ 8వ తేదీన ఆన్‌లైన్ విధానంలో 4వ 'క్రీడా జ్ఞాన్ పరీక్ష' నిర్వహిస్తున్నట్లు వైఎస్ఆర్ జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు, విద్యార్థులు, పేరెంట్స్, సిటిజన్స్ ఈ పరీక్ష రాసేందుకు ఆన్‌లైన్ ద్వారా క్రీడాభారతి. ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో ఆధార్ నెంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పరీక్ష 8వ తేదీ ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటలలోపు ఎప్పుడైనా రాసే వెసులుబాటు ఉందన్నారు. 50 ప్రశ్నలు, 25 నిమిషాల సమయం ఉంటుందన్నారు. 12 సంవత్సరాలు పైబడిన వారందరూ అర్హులేనని పేర్కొన్నారు. పరీక్షలో ప్రథమస్థానంలో నిలిచిన వారికి రూ.1 లక్ష, రెండోస్థానంలో నిలిచినవారికి రూ.50వేలు, మూడోస్థానంలో నిలిచిన వారికి రూ.25 వేలు, 4వ స్థానంలో నిలిచిన వారికి రూ.11 వేలు చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు.


5న కడపలో దివ్యాంగుల క్రీడాపోటీలు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో ఈనెల 5వ తేదీన దివ్యాంగులను ప్రోత్సహిస్తూ క్రీడాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీఓ కె. జగన్నాథరెడ్డి తెలిపారు. జాతీయ వికలాంగుల దినోత్సవం పురస్కరించుకుని ఈ క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరుగు పందెం 50 మీటర్లు, 100 మీటర్లు, డిస్కస్‌త్రో, లాంగ్‌జంప్, షాట్‌పుట్, సాఫ్ట్‌బాల్, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

15న ఉచిత కృత్రిమ పాదాల ఎంపిక శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రమాదవశాత్తు, ఇతర కారణాలవల్ల కాళ్లు కోల్పోయిన వారికి చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన ఉచిత కృత్రిమ పాదాల కొలతల శిబిరాన్ని కడపలోని యూటీఎఫ్ భవన్‌లో ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని ప్రోగ్రాం కోఆర్డినేటర్ వికసిత ఫౌండేషన్ చైర్మన్ శూలం లక్ష్మీదేవి తెలిపారు. కొలతల కార్యక్రమం అనంతరం పంపిణీ ఉంటుందని వివరించారు. వివరాలకు 9966475742, 9154195061, 9642471600 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

చెస్ టోర్నీ చాంపియన్‌గా కడప క్రీడాకారుడు



అష్రఫ్‌సుభాని

కడప స్పోర్ట్స్ : ఆంధ్రప్రదేశ్ ఓపన్ చెస్ టోర్నమెంట్ విజేతగా కడప నగరానికి చెందిన అష్రఫ్ సుభాని నిలిచాడు. అనంతపురం నగరంలో డిసెంబర్ 1 వతేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో డి. అష్రఫ్ సుభాని 7 రౌండ్లలో 6.5 పాయింట్లతో విజేతగా నిలిచి విన్నర్స్‌ట్రోఫీ, రూ.7వేలు నగదు బహుమతి సాధించినట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి బి. అనీస్‌దర్బారీ తెలిపారు. అదే విధంగా అండర్–10 బాలికల విభాగంలో కడప నగరానికి చెందిన దీపిక 6వస్థానంలో నిలిచినట్లు తెలిపారు.

అదే వివక్ష

- నాటి నుంచి చంద్రబాబు హయాంలో జిల్లాకు ఒరిగింది శూన్యం
- మొన్న మెడికల్ కళాశాలకు మంగళం ...నిన్న ఎంఎస్ఎంఈ తరలింపు
- తాజాగా ఏపీజీబీ హెడ్ ఆఫీసుకు ఎసరు
- కడప నుంచి తరలివెళుతున్న పబ్లిక్ సెక్టార్

సాక్షి ప్రతినిధి, కడప : కడప అంటే ఆది నుంచి వివక్షే. రాష్ట్ర ప్రజలందరికీ పాలకుడైనా, ఇక్కడి ప్రజల పట్ల చీత్కారం తెరపైకి వస్తూనే ఉంది. మునుపంతా ఓట్లు–సీట్లు ఇవ్వలేదు, మీకేందుకు పనులు చేయాలంటూ సీఎంహోదాలో బాహాటంగా వ్యాఖ్యానించిన చంద్రబాబునాయుడు తాజాగా ఓట్లు–సీట్లు ఇచ్చినా అదే వివక్ష చూపుతున్నారు. క్రమం తప్పకుండా పబ్లిక్ సెక్టార్‌కు మంగళం పలుకుతున్నారు. కడప అంటే కడుపు మంట ప్రదర్శిస్తున్నారు.

చంద్రబాబు నాయకత్వంలో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత పులివెందుల మెడికల్ కళాశాలకు మోకాలొడ్డారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) మంజూరు చేసిన 50 ఎంబీబీఎస్ సీట్లు తిరస్కరించారు. రూ.530 కోట్లతో వైఎస్సార్‌సీపీ సర్కార్ మెడికల్ కళాశాలను నెలకొల్పితే, అవకాశాన్ని సద్వినియోగ పర్చకుండా తిరస్కరిస్తూ చంద్రబాబు సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత భారత ప్రభుత్వం కొప్పర్తి మెగా ఇండస్ట్రీయల్ హబ్‌కు మంజూరు చేసిన రెండో ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ కమ్ టెస్టింగ్ ఫెసిలిటీని సైతం అమరావతికి తరలించారు. వెనుకబడిన జిల్లాను సమగ్రాభివృద్ధి కోసం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ఎంఎస్ఎంఈ అభివృద్ధి చెందిన ప్రాంతానికి తరలించుకుపోయారు.

నాడు ఉర్దూ యూనివర్సిటీకి మంగళం

ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఎప్పుడు బాధ్యతలు చేపట్టినా జిల్లాను అన్యాయానికి గురి చేస్తున్నారు. అందుకు ఆయన చర్యలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. 2014–19హయాంలో కడపకు మంజూరైన ఉర్దూ యూనివర్సిటీని కర్నూలుకు తరలించారు. అప్పట్లో ఇక్కడ కాకపోయినా రాయలసీమలోనే కొనసాగించారని సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఈమారు ఎంఎస్ఎంఈ సంస్థను తరలించారు. రూ. 250 కోట్ల అంచనా వ్యయంతో టెక్నాలజీ సెంటర్‌ను కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ హబ్‌కు భారత ప్రభుత్వం మంజూరు చేసింది. కొప్పర్తిలోని నార్త్ బ్లాక్‌లో 19.5 ఎకరాల విస్తీర్ణంలో ఉచిత లీజు ప్రాతిపదికన ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశారు. అమలు చేయాల్సిన చంద్రబాబు సర్కార్ జిల్లాకు మొండిచేయి చూపుతూ అమరావతికి తరలించారు.



కడపలోని ఏపీజీబీ ప్రధాన కార్యాలయం

బాధ్యతను గుర్తించని ప్రజాప్రతినిధులు...

క్రమం తప్పకుండా జిల్లా నుంచి పబ్లిక్ సెక్టార్ తరలిస్తుంటే ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారపార్టీ ప్రజాప్రతినిధులు బాధ్యతను గుర్తించలేకపోతున్నారు. కొత్త పరిశ్రమలు తీసుకురాకపోయినా కనీసం ఉన్న సంస్థలనైనా కాపాడుకోవాల్సిన అవసరం లేదా అని పలువురు నిలదీస్తున్నారు. ఇవేమి పట్టించుకునే స్థితిలో కూటమి సర్కార్ ప్రజాప్రతినిధులు లేరని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఆదాయ మార్గాలపై ఉన్న శ్రద్ధ ఈ ప్రాంతపైనా.. ప్రజలపైనా చూపించలేకపోతున్నారనే విమర్శలను మూటగట్టుకున్నారు. ఈక్రమంలో పౌర సమాజం మరీ ముఖ్యంగా ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రజా సంఘాల ప్రతినిధులు, కార్మిక సంఘాలు పోరాటం దిశగా నడుం బిగిస్తున్నారు. మంగళవారం దుర్గమ్మ దేవస్థానం ఎదురుగా ఉన్న డాక్టర్ ముఖర్జీ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. మరీ ముఖ్యంగా అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ప్రాంతం కోసం ప్రజల కోసం ఇప్పటికైనా కళ్లు తెరవాలని పలువురు కోరుతున్నారు.

ఏపీజీబీ హెడ్ ఆఫీసుకు ఎగనామం పెట్టేందుకు రంగం సిద్ధం

తాజాగా కడప కేంద్రంగా పని చేస్తున్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) హెడ్ ఆఫీసు తరలింపునకు రంగం సిద్ధం చేశారు. గ్రామీణ బ్యాంకుల పునర్వ్యవస్థీకరణ పేరుతో అమరావతికి తరలించనున్నారనే వార్తలు కడప జిల్లాలోనే కాదు, రాయలసీమ వ్యాప్తంగా అలజడి సృష్టిస్తోంది. వాస్తవంగా కడప కేంద్రంగా పని చేస్తున్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు బిజినెస్ పరంగా, లాభాలపరంగా మొదటి స్థానంలో ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వ మొదటి నిబంధన పెద్ద బ్యాంకు హెడ్ క్వార్టర్‌లోనే కొనసాగించవచ్చని తెలిపినప్పటికీ చంద్రబాబు సర్కార్ జిల్లాకు ఎగనామం పెట్టేందుకు సన్నమైందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అమరావతికి తరలింపు వార్త వెనకబడిన రాయలసీమపై, అందులో కడప పట్ల వివక్ష చూపడమే అవుతుందని వారు భావిస్తున్నారు.

వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

అధికారులకు కలెక్టర్ శ్రీధర్ ఆదేశం

కడప సెవెన్‌రోడ్స్/కమలాపురం : ఫెంగల్ తుపాను నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అన్ని శాఖల అధికారులను.. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో పరిస్థితులపై సోమవారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి జిల్లా స్థాయి, క్షేత్ర స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పంట నష్టం జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా చెరువులు, కాలువ కట్టల పరిరక్షణపై దృష్టి పెట్టాలని, వాగులు వంకలు కాలువల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన పంటలు సాగు చేసే రైతులను అప్రమత్తం చేయాలని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులకు సూచించారు. ఎక్కడా పశు నష్టం జరగకుండా పశు సంవర్ధక సహాయకులు పాడి రైతులకు అవగాహన పెంచాలని వాటి సంరక్షణ బాధ్యత పూర్తిగా చూసుకునేలా తెలియజేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయం అయితే వెంటనే దానిని పునరుద్ధరించేలా విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సంబంధించి జిల్లాలోని అన్ని ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీలలో డాక్టర్లు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు అందుబాటులో ఉండాలన్నారు. ముందస్తుగా అందుబాటులో ఉన్న పాఠశాలలు, కళాశాలలను పునరావాస కేంద్రాలుగా ఉపయోగించేందుకు ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన...!

ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటల పరిస్థితిని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సోమవారం మధ్యాహ్నం కమలాపురం మండల పరిధిలో చదిపిరాళ్ల, సి.గోపులాపురం గ్రామాల్లో స్థానిక ఎమ్మెల్యే కృష్ణ చైతన్యరెడ్డితో కలిసి వరి, శనగ పంటలను పరిశీలించారు. అనంతరం.. రైతులతో మాట్లాడి పంటల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి వర్షాల కారణంగా జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు గానీ, పశు సంపదకు కానీ ఎలాంటి నష్టం వాటిల్లలేదని జిల్లా కలెక్టర్ తెలిపారు. అనంతరం సాయంత్రం ఒంటిమిట్ట మండలం సాలాబాద్ గ్రామంలో పసుపు, సంపెంగ ఉద్యాన పంటలను సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి నాగేశ్వరరావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి సుభాషిణి, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు. మండల స్పెషలాఫీసర్ వెంకట సుబ్బారెడ్డి, శాస్త్రవేత్త సునీల్, ఏడీఏ నరసింహారెడ్డి, తహసీల్దార్ శివరామిరెడ్డి, ఏఓ సరస్వతి, పశు సంవర్ధక వైద్యాధికారిణి శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



కమలాపురం మండలంలో పంటలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ తదితరులు

అప్పుల భోజనం

- అంగన్వాడీలపై ధరల భారం
- పాత చార్జిలతోనే మెనూ అమలు చేయాలంటున్న సర్కార్
- నెలనెలా నిధులు విడుదల కాక సతమతం
- ప్రభుత్వ తీరుతో అంగన్వాడీల బేజారు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని అంగన్వాడీ కార్యకర్తలు ధరల భారాన్ని మోయాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మెను ప్రకారం చిన్నారులకు భోజనం అందించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మెనూకు తగ్గట్టు పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలంటే ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు అమాంతంగా పెరగడంతో అప్పులు చేసి మెనూ అమలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

జిల్లాలోని 13 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా, 2389 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో గర్భిణులు13,256 మంది, బాలింతలు 13,719 మంది, చిన్నారులు 1,02,235 మంది ఉన్నారు. చిన్నారులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించాల్సి ఉంది. కేంద్రాలకు ప్రభుత్వమే బియ్యం, నూనె, కందిపప్పు, పాలు, గుడ్లు అందిస్తోంది. చిన్నారులకు సంఖ్యకు అనుగుణంగా ఎంతమేరకు సరుకులు అవసరమో వారు అందించే జాబితా ప్రకారం పంపిణీచేస్తారు. కందిపప్పు, రేషన్ బియ్యం ప్రతినెలా రేషన్ దుకాణాల ద్వారా తెచ్చుకోవాల్సి ఉంటుంది. సరుకులు తరలించేందుకు అంగన్వాడీ కేంద్రాల్లో జాగ్రత్తగా నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి నగదు చెల్లించదు. వారే అన్నీ భరించి తెచ్చుకోవాల్సి వస్తోంది.

చిన్నారులకు కేటాయింపులు ఇలా

అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న ఒక్కో చిన్నారికి రోజుకు 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల పప్పు, ఐదు గ్రాముల నూనె మాత్రమే ప్రభుత్వం కేటాయిస్తోంది. అలాగే వంట తయారీకి సంబంధించి ఒక్కో చిన్నారిపై రోజుకు రూ. 1.50 పైసలు, గ్యాస్ ఛార్జీల కింద 50 పైసల చొప్పున నెలలో 25 రోజుల పనిదినాలకు ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ మొత్తంతో చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించాల్సి ఉంటుంది. నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చే బిల్లులు సరిపోవడం లేదని, సొంతంగా కొంత సొమ్ము వెచ్చించాల్సివస్తోందని అంగన్వాడీలు వాపోతున్నారు.

ప్రస్తుతం కూరగాయల ధరలుభారీగా పెరగడంతో ప్రభుత్వం ఇచ్చే డబ్బు ఏమాత్రం సరిపోవడం లేదు. మూడు నెలలవుతున్నా గ్యాస్‌కు సైతనం నగదు చెల్లించకపోవడంతో అంగన్వాడీలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పలు సందర్భాల్లో చేతి నుంచి డబ్బు వెచ్చించి సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి సిబ్బందికి ఏర్పడింది. మెనూ తప్పక పాటించాలని చెప్పే ఉన్నతాధికారులు పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లులు ఇవ్వాలంటున్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఇస్తున్న ఉచిత గ్యాస్ అంగన్వాడీ కేంద్రాలకు అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అంగన్వాడీ కార్యకర్తలు కోరుతున్నారు.



అంగన్వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించిన సమాచారం

ప్రాజెక్టు పేరు	అంగన్వాడీ కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	చిన్నారులు
బద్వేలు	180	1077	1100	7700
పోరుమామిళ్ల	168	711	794	5611
జమ్మలమడుగు	143	982	1038	6941
ముద్దనూరు	164	821	881	6350
కడప–1	280	2531	2543	16456
సీకే దిన్నె	218	1056	1090	10855
కమలాపురం	166	675	723	5729
చాపాడు	170	874	942	7358
మైదుకూరు	176	916	964	7022
ప్రొద్దుటూరు రూరల్	135	980	1000	6458
ప్రొద్దుటూరు	232	990	1040	9140
పులివెందుల	213	893	901	6791
వేంపల్లె	144	750	703	5824
మొత్తం	2389	13262	13719	1,02,235

ప్రభుత్వానికి నివేదించాం



ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా బిల్లుల పెంపు విషయాన్ని అంగన్వాడీలు మా దృష్టికి తీసుకొచ్చారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో అందిస్తున్న నగదు పెంపు విషయమై ఉన్నతాధికారులకు నివేదించాం. – దేవిరెడ్డి శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ, కడప

బాబు ష్యూరిటీ.. వీర బాదుడుకు గ్యారెంటీ

- తుపానుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : ఎన్నికలకు ముందు టీడీపీ 'బాబు ష్యూరిటీ....భవిష్యత్‌కు గ్యారెంటీ'అంటూ ప్రచారం చేశారని, అధికారంలోకి వచ్చాక అన్ని ధరలు పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. ఫలితంగా 'బాబు ష్యూరిటీ...వీర బాదుడుకు గ్యారెంటీగా మారిందని ఎద్దేవా చేశారు. సోమవారం కడపలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి 7నెలలైనా రాష్ట్ర ప్రజలకు ఎలాంటి మేలు చేయలేదని, అభివద్ధి అంతకంటే చేయలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని, పాలన అనేదే లేకుండా పోయిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే అదే సీజన్‌లో పంటనష్ట పరిహారం ఇచ్చేవారన్నారు. ఇప్పుడు పంట నష్టపోయినా దిక్కు లేదని, ఎరువులు, విత్తనాలు ఇచ్చేవారే కరువయ్యారన్నారు. ఫెంగల్ తుపాను వల్ల వరి పంట చేతికొచ్చే సమయంలో తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. అయినా ఈ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. వరి ధాన్యాన్నిగానీ, రంగు మారిన ధాన్యాన్నిగానీ ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ అధికారులే ఉండటం లేదన్నారు. చంద్రబాబు నుంచి మంత్రుల వరకు అందరూ మాటలు చెబుతున్నారు తప్ప వాస్తవరూపం దాల్చలేదన్నారు. కాకినాడ పోర్టులో పీడీఎస్ బియ్యం అంటూ చంద్రశేఖర్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో బియ్యం నుంచి కూరగాయల వరకు ధరలన్నీ పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చంద్రబాబు బాదుడే బాదుడు హడావిడి చేశారని, ఇప్పుడేమో వీరబాదుడు బాదుతున్నారన్నారు. దీంతో ప్రజలు ఇదేం ఖర్మరా బాబు అనుకుంటున్నారన్నారు. ఎన్నికల ముందు ప్రతి మీటింగులో విద్యుత్ చార్జీలు పెంచేది లేదు అని ఊదరగొట్టారని, ఈ ఐదారు నెలల్లోనే రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచారన్నారు. ఇప్పుడు కరెంట్ బిల్లు పట్టుకుంటే షాక్ కొట్టే పరిస్థితి ఏర్పడిదన్నారు.స్థానిక కూటమి నేతలు కూడా ఎక్కడికక్కడ లోకల్ ట్యాక్స్‌తో వీర బాదుడు మొదలుపెట్టారన్నారు. బెల్టు పెడితే మీకు బెల్టు తీసేస్తా అని సీఎం అంటుంటే...హోం మినిస్టర్ నియోజకవర్గంలోనే కాదు అన్ని చోట్లా బెల్టు షాపులను వేలం వేసుకున్నారన్నారు. 90 శాతం మద్యం షాపులన్నీ వారే కైవసం చేసుకున్నారని, వీళ్లంతా ప్రజల డబ్బు ఎలా దోచుకుంటున్నారో కళ్లకు కట్టినట్లు కనిపిస్తోందన్నారు. ప్రజల డబ్బు దోచుకోవడానికే టీడీపీ ప్రభుత్వం వచ్చినట్లుందన్నారు. చేసేదంతా వారు చేసి ఇదంతా వైఎస్‌జగన్ వల్లే అంటూ పచ్చ పత్రికల్లో రాతలు రాయిస్తున్నాడు. ఫెంగల్ తుపాను కూడా వైఎస్ జగన్ వల్లే వచ్చిందన్నా ఆశ్చర్యపోనక్కర్లేదని ఎద్దేవా చేశారు. ప్రజలపై ఇన్ని రకాలుగా భారాలు వేసే చంద్రబాబు 30 ఏళ్లు అధికారంలో ఉండాలని పవన్‌కళ్యాణ్ అనడం దారుణమన్నారు. బూడిద డబ్బులు పంచుకునేందుకు చంద్రబాబు నేరుగా పంచాయతీలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్ కుమార్, మల్లికార్జున కిరణ్, షఫీ, నాగేంద్రారెడ్డి పాల్గొన్నారు.

స్కౌట్‌తో క్రమశిక్షణ.. సేవాభావం

రాయచోటి (జగదాంబసెంటర్) : ప్రతి ఒక్కరిలో క్రమశిక్షణ, దేశభక్తి, సామాజిక సేవ పెంపొందడానికి స్కౌట్ శిక్షణ తోడ్పడుతుందని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం అన్నారు. రాయచోటి పట్టణంలోని ఓ కళాశాలలో సోమవారం నుంచి స్కౌట్ మాస్టర్లకు, గైడ్ కెప్టెన్లకు బేసిక్‌తో పాటు అడ్వాన్స్‌లో ఏడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ ప్రారంభ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ మాస్టర్లు, కెప్టెన్లు అందరూ సేవాభావం కలిగి క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలలో స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేసేందుకు సంబంధిత ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్చన విద్యాసంస్థల కరెస్పాండెంట్ మదన్‌మోహన్‌రెడ్డి, స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి నర్సింహారెడ్డి, ట్రెజరర్ ఓబుల్‌రెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సుబ్రమణ్యం

ఏపీఎస్‌ఐడీసీలో పెన్‌డౌన్ తాత్కాలికంగా విరమణ

కడప సెవెన్‌రోడ్స్ : ఏపీఎస్ ఐడీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికులు చేపట్టిన పెన్‌డౌన్ ఆందోళన కార్యక్రమాన్ని ఈ నెల 24వ తేదీ వరకు తాత్కాలికంగా విరమించాలని కడప ఏపీఎస్ ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కోరారు. ఏపీఎస్ ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్, కార్మికుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించి నిర్ణయాలు తీసుకున్నారని ఆయన తెలిపారు. ఏపీఎస్ ఐడీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వలేదు. దీనిపై గతనెల 27న 'అందని వేతనం.. బతుకు భారం' శీర్షికన ‹సాక్షి›లో కథనం ప్రచురితమైంది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించారు. ఈ విషయంపై వివరణ ఇవ్వాలంటూ కలెక్టర్ కంట్రోల్ రూము నుంచి ఐడీసీ అధికారులకు వాట్సాప్ మెసేజ్ వెళ్లింది. గత నెల 25న ఔట్‌సోర్సింగ్ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం పెన్‌డౌన్ చేపట్టారు. విజయవాడలోని ఏపీఎస్ ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ స్పందిస్తూ పెన్‌డౌన్ కార్యక్రమాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. కార్మికుల డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని, సంస్థ కార్యకలాపాలు సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

అయ్యప్ప లడ్డూ రూ.1.20 లక్షలు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని శ్రీ మిట్టమల్లేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి మండల పూజ కార్యక్రమంలో భాగంగా స్వామి వారి వద్ద ఉంచిన లడ్డూకు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో గిరి హోటల్ యజమాని వెంకటరామిరెడ్డి రూ.1.20 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అయ్యప్ప భక్తమండలి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిల చేతుల మీదుగా ఈ లడ్డూను అందుకున్నారు.

మద్యం మత్తులో నిర్లక్ష్యంగా డ్రైవింగ్

చాపాడు : ప్రొద్దుటూరు మండలం అమృతానగర్‌కు చెందిన మోపూరి సుధీర్ అనే యువకుడు సోమవారం మద్యం మత్తులో నిర్లక్ష్యంగా బైకు డ్రైవింగ్ చేసి ముగ్గురిని గాయపర్చాడు. బాధితులు తెలిపిన వివరాల మేరకు సుధీర్ బైక్‌లో చాపాడు మండలం అనంతపురం వెళ్లి తిరిగి వస్తూ కొత్త రాజువారిపేటలో సమీపంలో బైక్‌పై వెళుతున్న గండ్లూరు చలపతిరెడ్డి, వీరారెడ్డి లను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో చలపతిరెడ్డి కుడి కాలు విరిగింది. వీరారెడ్డి కాలికి స్వల్ప గాయాలయ్యాయి. ఇదే క్రమంలో చాపాడు సమీపంలోని మండల కార్యాలయం వద్ద ఆధార్ అప్డేట్ కోసం వచ్చి బైక్‌లో వెళుతున్న శ్రీరాములపేట గ్రామానికి చెందిన కనపర్తి సుబ్బారెడ్డిని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో సుబ్బారెడ్డి ఎడమ కాలికి గాయాలయ్యాయి. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదానికి కారణమైన సుధీర్‌ను స్థానికులు పోలీసులకు అప్పగించారు. మద్యం సేవించి నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమైన ఈ ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

గాయపడిన వృద్ధురాలు మృతి

ముద్దనూరు : మండలంలోని కొలవలి గ్రామానికి చెందిన ఉమ్మడిశెట్టి నారాయణమ్మ(68) అనే వృద్ధురాలు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందింది. సీఐ దస్తగిరి సమాచారం మేరకు ఈనెల 1వతేదీన నారాయణమ్మను అతని కుమారుడు వెంకట సుబ్బయ్య మోటార్ సైకిల్‌పై పని నిమిత్తం ముద్దనూరుకు తీసుకు వచ్చాడు. తిరిగి కొలవలికి వెళ్తుండగా కాండ్లోపల్లె గ్రామం దాటిన తర్వాత మోటార్‌బైక్‌కు అడవి పంది అడ్డం వచ్చింది. వేగం అదుపు చేయలేక బైకు అదుపు తప్పింది. ఈ సంఘటనలో నారాయణమ్మ కిందపడిపోవడంతో తలకు వెనుక భాగంలో, కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమె కుమారుడు వెంకట సుబ్బయ్యకు కుడి కాలికి గాయమైంది. క్షతగాత్రులిద్దరినీ 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నారాయణమ్మ ఆదివారం రాత్రి మరణించింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మైలవరం జలాశయం మరమ్మతుకు ప్రతిపాదనలు

జమ్మలమడుగు : మైలవరం జలాశయం, అతిథి గృహం తదితర మరమ్మతులకు మొత్తం 83.72 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యు.రమేష్ తెలిపారు. నవంబర్ 18న బోటింగ్ వేళ..భద్రత డొల్ల శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. 1979లో మైలవరం రిజర్వాయర్ నిర్మాణం జరగ్గా 2005లో మైలవరం ఆధునికీకరణ కోసం టెండర్లు పిలిచారన్నారు. కట్టపై ప్రహరీ, రోడ్లు, వీధిలైట్లు ఏర్పాటు చేయడం కోసం 91వ ప్యాకేజీ కింద పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రస్తుతం ఆ పనులు ఆగిపోయాయన్నారు. మైలవరం జలాశయం కట్టపై వర్షా కాలంలో వాహనాలు తిరగడంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. 2022–23లో అత్యవసర పనుల కింద కోటి ఆరు లక్షల రూపాయలతో ముఖ్యమైన పనులైన డ్యాం రేడియల్ గేట్ల పనులు, గేట్లపైన లైట్లు, జనరేటర్ ఏర్పాటు చేశామన్నారు. తిరిగి మైలవరం జలాశయంలో పూర్తి స్థాయిలో మరమ్మతులతోపాటు అతిథి గృహం పనుల కోసం 83 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపించామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులను ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు.

ప్రొద్దుటూరులో రౌడీషీటర్ దారుణ హత్య

- లాడ్జీలో మద్యం సీసాలతో కొట్టి చంపిన దుండగులు
- పరారీలో ప్రధాన అనుమానితులు సునీల్, లోకేశ్వరరెడ్డి
- పోలీసుల అదుపులో టీడీపీ నేత వీఎస్ ముక్తియార్ సోదరుడు ముజీబ్



ఘటనా స్థలంలో రాఘవేంద్ర అలియాస్ పప్పీ మృతదేహం (ఇన్‌సెట్) రాఘవేంద్ర అలియాస్ పప్పీ (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని ఓ లాడ్జీలో జరిగిన హత్య కలకలం రేపింది. రౌడీషీటర్ కొప్పుల రాఘవేంద్రకుమార్ అలియాస్ పప్పీ (30)ని మద్యం సీసాలతో తలపై కొట్టి దారుణంగా హత్య చేశారు. లాడ్జీలోని గదిలో రక్తపు మడుగులో పడి ఉండగా రూం బాయ్ గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. సాయికుటీర్ రోడ్డుకు చెందిన లోకేశ్వరరెడ్డి ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. అతను శనివారం బీజీఆర్ లాడ్జీలో గది తీసుకున్నాడు. ఆ రోజు నుంచి పలువురితో కలిసి లాడ్జీలో మద్యం సేవించాడు. అతనికి సంజీవనగర్‌కు చెందిన పప్పీతో పరిచయం ఉంది. ఈ క్రమంలో రాఘవేంద్రతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీఎస్‌ముక్తియార్ సోదరుడు ముజీబ్, రెడ్డివారివీధికి చెందిన సునీల్ ఆదివారం రాత్రి లాడ్జీకి వెళ్లారు. అక్కడ అందరూ కలిసి మద్యం తాగారు. అర్ధరాత్రి దాటిన తర్వాత 12.30 సమయంలో వారి మధ్య గొడవ జరుగుతుండటంతో ముజీబ్ లాడ్జీలో నుంచి బయటికి వెళ్లాడు. వెళ్లేటప్పుడు రూంలో గొడవ జరుగుతోందని రిసెప్షన్‌లో చెప్పాడు. మద్యం మత్తులో గొడవ పడటం సహజమేనని భావించి రిసెప్షన్‌లోని లాడ్జీ సిబ్బంది అతని మాటలను పట్టించుకోలేదు. ముజీబ్ వెళ్లిన తర్వాత సోమవారం వేకువ జామున 1.30 సమయంలో లోకేశ్వరరెడ్డి, సునీల్‌లు లాడ్జీలో నుంచి బయటికి వెళ్లిపోయారు. ఇదంతా లాడ్జీలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. సోమవారం ఉదయం గదిని శుభ్రం చేసేందుకు రూం బాయ్ వెంకటేష్ వెళ్లగా అప్పటికే పప్పీ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. లాడ్జీ సిబ్బంది సమాచారం మేరకు వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మద్యం సీసాలతో కొట్టడం వల్ల అతను మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు.

రాఘవేంద్ర అలియాస్ పప్పీపై అనేక కేసులు

పప్పీపై ప్రొద్దుటూరు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. టూ టౌన్, త్రీ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు అతనిపై నమోదయ్యాయి. 2013లో అతను పప్పీ గ్యాంగ్ పేరుతో పట్టణంలో హడలెత్తించాడు. పట్టణంలోని అనేక మంది యువకులను ప్రోగు చేసుకొని చిన్నాచితక దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడేవాడు. అతని ఆగడాలు శృతి మించడంతో పోలీసు ఉన్నతాధికారులు 2014లో అతన్ని పట్టణ బహిష్కరణ చేశారు. దీంతో అప్పటి నుంచి పప్పీ హైదరాబాద్, బెంగళూరులో ఉంటూ వచ్చాడు. తర్వాత కువైట్‌కు వెళ్లి వచ్చినట్లు సన్నిహితులు చెబుతున్నారు. రెండేళ్ల క్రితం రాఘవేంద్ర ప్రొద్దుటూరుకు వచ్చాడు. ఏడాది క్రితం సొంత బంధువులను బెదిరించగా వారు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఒక యువకుడిని ఫోన్‌లో బెదిరించగా అతను టూ టౌన్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో పోలీసులు పప్పీని పిలిపించి మందలించారు.

పోలీసుల విచారణ..

పప్పీని హత్య చేసిన వ్యక్తులెవరనేది పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చినప్పటికీ.. హత్యకు గల కారణాలు మాత్రం అంతుచిక్కడం లేదు. డీఎస్పీ భక్తవత్సలం, సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. ఘటనా స్థలంలో క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించారు. మద్యం మత్తులో జరిగిన హత్యనా లేక పాతగొడవలే కారణమా అనేది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. పప్పీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. లాడ్జీ మేనేజర్ చంద్రఓబుళరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టామన్నారు.

వివాహమై ఆరు నెలలైనా కాలేదు..

ఆరు నెలల క్రితం పప్పీ సంజీవనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న అనూషను రెండో పెళ్లి చేసుకున్నాడు. లాడ్జీలో భర్త మృతదేహాన్ని చూసి అనూష విలపించసాగింది. వివాహమై కనీసం ఆరు నెలలైనా కాకముందే భర్త దుర్మరణం చెందాడని కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. కుమారుడు మృతి చెందాడనే సమాచారం తెలియడంతో తల్లి సరస్వతి ఘటనా స్థలానికి చేరుకుంది. మృతదేహాన్ని చూసి ఆమె కన్నీరుమున్నీరైంది.

పరారీలో నిందితులు..

కొంత సేపటి వరకు మృతుడు ఎవరన్నది పోలీసులకు తెలియలేదు. ఆ తర్వాత హత్యకు గురైన వ్యక్తి పప్పీ అని పలువురు చెప్పడంతో అతని భార్య, తల్లిని పిలిపించి మృతదేహాన్ని చూపించారు. వారు చెప్పిన తర్వాత అతన్ని రాఘవేంద్రకుమార్ అలియాస్ పప్పీగా నిర్ధారించారు. రిసెప్షన్‌లోని రిజిష్టర్‌ను పరిశీలించిన పోలీసులు లోకేశ్వరరెడ్డి పేరుతో రూం బుక్ అయినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే లాడ్జీలోని వారి గదికి ఎవరెవరు వచ్చారనే విషయాలు సీసీ పుటేజీ ద్వారా పోలీసులు గుర్తించారు. వారిలో లోకేశ్వరరెడ్డి, సునీల్ సెల్ నంబర్లకు ఫోన్ చేయగా ఫోన్లు పని చేయలేదు. వారిద్దరు పరారీలో ఉండటంతో పోలీసుల అనుమానం మరింత బలపడింది. లోకేశ్వరరెడ్డి, సునీల్‌లు పప్పీని హత్య చేసి ఉంటారని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. వారితో కలిసి ఉన్న మరో వ్యక్తి ముజీబ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.



ప్రధాన అనుమానితుడు లోకేశ్వరరెడ్డి (ఫైల్)

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు

కడప అర్బన్ : జిల్లాలో ప్రజలు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మైదుకూరు : మండలంలోని మిట్టమానుపల్లె వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలకృష్ణ (25) అనే యువకుడు మృతి చెందాడు. ఖాజీపేట మండలం నాగసానిపల్లెకు చెందిన బాలకృష్ణ మరో యువకుడు మోటార్ బైక్‌పై వస్తుండగా మైదుకూరు డిపోకు చెందిన బ్రహ్మంగారిమఠం సర్వీసు బస్సు ఎదురుగా వెళుతోంది. మిట్టమానుపల్లె వద్ద బస్సును తప్పించే ప్రయత్నంలో బైక్‌పై నుంచి ఇరువురు కింద పడినట్టు తెలుస్తోంది. ప్రమాదంలో బాలకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. బస్సు ను తప్పించే ప్రయత్నంలో బైక్‌ను బస్సు ఢీకొన్నదా లేదా అనే విషయం తెలియాల్సి ఉంది.

తండ్రి చేతిలో తనయుడి హతం



హుస్సేన్ బాషా (ఫైల్)



మృతి చెందిన హుస్సేన్ బాషా

దువ్వూరు : దువ్వూరు మండలం కానగూడూరు గ్రామంలో సోమవారం తండ్రి చేతిలో కొడుకు హత్యకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి విచారించారు. దువ్వూరు పోలీస్ స్టేషన్‌లో మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ యాదవ్ కేసు వివరాలను విలేకరులకు వెల్లడించారు. మహబూబ్ షరీఫ్‌కు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమార్తెలకు పెళ్లి చేయగా, కొడుకు తల్లిదండ్రుల వద్దే ఉన్నాడు. తండ్రి కొలిమి పని చేస్తుండగా, భార్య, కుమారుడు హుస్సేన్ బాషా (23) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. హుస్సేన్ బాషాకు దువ్వూరుకు చెందిన మెహబూబ్‌తో ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. వీరికి రెండున్నరేళ్ల కుమార్తె షాహీన్, ఒక టిన్నర సంవత్సరాల కుమారుడు షాహిద్ ఉన్నారు. హుస్సేన్‌బాషా మద్యానికి బానిసై తల్లిదండ్రులను, భార్యను డబ్బుల కోసం వేధిస్తుండేవాడు. కొద్ది రోజుల క్రితం మద్యానికి డబ్బు ఇవ్వలేదని తండ్రిని కట్టెతో కొట్టి బెదిరించాడు. ఇదే క్రమంలో సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో హుస్సేన్ బాషా మద్యం తాగి ఇంటికి వచ్చి తండ్రి మహబూబ్ షరీఫ్‌ను వేధించాడు. డబ్బు లేదని తండ్రి చెప్పడంతో డబ్బు ఇవ్వకుంటే చంపుతానని కొడుకు బెదిరించాడు. భయపడిన మహబూబ్ షరీఫ్ రోకలి బండతో కొడుకు తలపై బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని చాగలమర్రి కేరళ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ యాదవ్ తెలిపారు. హుస్సేన్ బాషా మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : మోసానికి బ్రాండ్ అంబాసిడర్ ముఖ్యమంత్రి చంద్రబాబు అని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ఆరోపించారు. సోమవారం కడపలోని తన నివాసంలో విలేకరులతో ఆయన మాట్లాడారు.

ఎన్నికలకు ముందు చంద్రబాబు ప్రచార సభల్లో బాబు ష్యూరిటీ..భవిష్యత్తుకు గ్యారెంటీ అన్నారని, ఇప్పుడు బాబు ష్యూరిటీ వీరబాదుడుకు గ్యారెంటీ అనే తరహాలో ప్రజలపై భారం వేస్తున్నారన్నారు. ఈ 6 నెలల కాలంలోనే 2 సార్లు విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. విద్యుత్ చార్జీల పెంపు వల్ల రూ. 15485 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారన్నారు. చంద్రబాబు ప్రజలను ఎలా మోసం చేస్తారో ఇదే నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో నీకు రూ.15వేలు, నీకు రూ.15వేలు అంటూ ప్రచారం చేశారని, అదే నోటితో నేడు శాసనసభ సాక్షిగా హామీలు అమలు చేయాలంటే భయం వేస్తోందని అంటున్నారని ఎద్దేవా చేశారు. ట్రూ అప్ చార్జీలు ఎత్తివేస్తానని, చార్జీలు పెంచనని చెప్పిన చంద్రబాబు నిస్సిగ్గుగా చార్జీలు పెంచుతున్నారని మండిపడ్డారు. ఇంధన సర్దుబాటు పేరుతో ప్రజలపై బాదుడు మొదలు పెట్టారన్నారు. ఇప్పటికే దీపావళి కానుకగా రూ.6072 కోట్ల భారం మోపారని, మళ్లీ ఇప్పుడు యూనిట్‌పై 92 పైసలు చొప్పున పెంచుతున్నారన్నారు. రెండో విడత ద్వారా రూ.9వేల కోట్లు కలిపితే మొత్తం రూ.15485కోట్ల భారం ప్రజలపై మోపుతున్నారన్నారు. చంద్రబాబు చేసుకున్న విద్యుత్ ఒప్పందాలు ఈ రాష్ట్రానికి శాపంగా మారాయన్నారు. అవసరం లేకపోయినా ఆనాడు విద్యుత్ కొనుగోలు చేశారని, ఆనాడు చంద్రబాబు రూ.4.85లతో విండ్ పవర్ కొంటే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2.49 పైసలతో కొనుగోలు చేసిందన్నారు. 2014–19 మధ్య కాలంలో చంద్రబాబు లక్ష కోట్లకు ఒప్పందాలు చేసుకున్నారన్నారు. 2500 మెగావాట్ల సోలార్ పవర్ కొనుగోలుకు 35 పీపీఏలు, 3500 విండ్ పవర్ కొనుగోలుకు 133 పీపీఏలు చేసుకున్నారన్నారు. సోలార్ పవర్‌ను రూ.5.90లతో, విండ్ పవర్‌ను రూ.4.84లతో కొనుగోలు చేసేందుకు చంద్రబాబు ఒప్పందాలు చేసుకున్నారని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేవలం రూ.2.49లతో విద్యుత్ కొనుగోలు చేసేదుకు సెకీతో ఒప్పందం చేసుకుంటే నానా రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు ప్రభుత్వంలో డిస్కంలకు రూ.13255కోట్ల ఆర్థిక సాయం చేస్తే, వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.47800 కోట్ల సాయం చేసిందన్నారు. విద్యుత్‌ను తక్కువకు కొనుగోలు చేసిన వైఎస్ జగన్ పై మాత్రం పచ్చపత్రికలు తప్పుడు వార్తలు రాస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బీహెచ్ ఇలియాస్, దాసరి శివప్రసాద్, తోటక్రిష్ణ, షఫీ, దత్తసాయి, అహ్మద్, అజ్మతుల్లా, గఫార్ పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్తుండగా ఆటో బోల్తా

- ఒకరి మృతి
- 8 మందికి స్వల్ప గాయాలు



ఆటో ప్రమాదంలో మృతి చెందిన వెంకట భార్గవి

జమ్మలమడుగు రూరల్ : గండి క్షేత్రానికి దైవ దర్శనానికి వెళ్తుండగా ఆటో బోల్తా పడిన సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఎనిమిది మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ కల్పన కథనం మేరకు వివరాలు ఇలా.. జమ్మలమడు పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన దక్కా వెంకట భార్గవి (30) ఆమె భర్త వెంకటసుబ్బయ్య, దక్కా వెంకటేశ్, దక్కా వెంకట సుజాత, దక్కా వెంకట సుబ్బమ్మ, సుగుణ, వెంకట్ మరి కొంత మందితో కలసి గండి క్షేత్రానికి ఆటోలో బయలుదేరారు. ప్రొద్దుటూరు బైపాస్ సమీపంలో లారీని ఓవర్ టేక్ చేయబోతుండగా డ్రైవర్ వెంకటయ్య అదుపు చేయలేక ఆటో డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ సంఘటనలో వెంకట భార్గవి (30) అక్కడికక్కడే మృతి చెందగా మరో 8 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ఎస్ఐ కల్పన సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ముగ్గురు సంతానం ఉన్నారు. కాగా ప్రమాదానికి గురైన వారిలో ముగ్గురు అన్నదమ్ములు, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

మధుమేహం ప్రధాన సమస్యగా పనిచేద్దాం



లయన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో సంస్థ ప్రతినిధులు

కడప కల్చరల్ : మధుమేహం ప్రపంచాన్ని అత్యంత వేగంగా అల్లుకుపోతోందని, త్వరలో ప్రపంచంలో 50 శాతం మంది ఈ వ్యాధితో బాధపడే ప్రమాదముందని లయన్స్ ఇంటర్నేషనల్ ఆరోగ్య విభాగం ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో గ్లోబల్ యాక్షన్ టీం, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ప్రాంతీయ సమావేశం సోమవారం స్థానిక మానస ఇన్ సమావేశ మందిరంలో నిర్వహించారు. కడప, అనంతపురం, కర్నూలు, అన్నమయ్య, నెల్లూరు, చిత్తూరు జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆతిథ్య విభాగమైన లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కె.చిన్నపరెడ్డి, ఇతర అతిథులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎల్‌సీఐఎఫ్ ఏరియా ప్రతినిధి అంబటి సుధాకర్‌రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచమంతా మారుతున్న ఆహార శైలి అన్ని వయస్సుల వారిమీద విపరీత ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జీఎస్టీసీ మల్టీబుల్ ప్రతినిధి ఏఆర్‌కే చౌదరి, పీడీజీ రమేష్ నాథ్‌రెడ్డిలు మాట్లాడుతూ గ్లోబల్ స్థాయి పనితీరు, స్ఫూర్తితో స్థానిక సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక విభాగాలు సేవలు అందించాలని సూచించారు. లయన్స్ క్లబ్ గవర్నర్ గౌతమ్ మాట్లాడుతూ సేవలు అందించడంలో ఎంతో తృప్తి లభిస్తుందని, లయన్స్ క్లబ్ ద్వారా ఆ అవకాశం లభిస్తోందని తెలిపారు. జీఎస్టీ ప్రతినిధి ఇ.గోపాలకృష్ణ, అసిస్టెంట్ గవర్నర్ ఎం.విరూపాక్షిరెడ్డి, లయన్ చంద్రప్రకాశ్ మాట్లాడారు. కడప అన్నమయ్య క్లబ్ అధ్యక్షుడు అనంతబొట్ల వెంకట సుబ్బయ్య, పూర్వ అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, కోశాధికారి రవీంద్రనాథ్, పి.సంజీవరెడ్డి, జోజిరెడ్డి, కొండారెడ్డి, గంగాధర్, వర్మల ఆధ్వర్యంలో వివిధ విభాగాలలో విశేష కృషి చేసిన లయన్ సభ్యులకు నిర్వాహకులు అవార్డులను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు.

వరి రైతు అప్రమత్తం!

- భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారుల హెచ్చరిక
- తుపాను నేపథ్యంలో మరిన్ని జాగ్రత్తలు పాటించాలి
- పంట నీట మునిగితే కోలుకోలేని దెబ్బ
- జిల్లాలోని అట్లూరులో 17.2 మి.మీ. వర్షపాతం



చెన్నూరు మండలం చిన్నమాచుపల్లి వద్ద రోడ్డుపై ఆరబెట్టుకున్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు

కడప అగ్రికల్చర్ : ఫెంగల్ తుపాను హెచ్చరికల నేపథ్యంలో వరి రైతులు ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే జిల్లాలో చాలామంది రైతులు వర్షం రాదనే నమ్మకంతో పలు చోట్ల వరి కోతలను ప్రారంభించారు. తరువాత తుపాను తీవ్రత పెరిగి ఆదివారం నుంచి జిల్లాలో చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. దీంతోపాటు గాలులు కూడా వీచడంతో నేడో, రేపో కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట పలు చోట్ల నేలకొరిగింది. దీంతోపాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లుగా అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతులు వరికోతలు ఆపేయాలని సూచించారు. ఇదిలా ఉండగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం 10 గంటల వరకు చిరుజల్లులతో కూడిన వర్షం జిల్లాలోని పలు మండలాల్లో కురిసింది. అట్లూరులో అత్యధికంగా 17.2 మిల్లీ మీటర్ల వర్షం నమోదైంది. ఇంతకంటే ఎక్కువ వర్షం కురిస్తే పలు చోట్ల పంటల్లో నీళ్లు నిలిచే అవకాశం ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. సోమవారం జిల్లాలోని పలు మండలాల్లో జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు వరిపంటతోపాటు పలు ఆరుతడి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలను ఇచ్చారు. దీంతోపాటు తడిచిన వరిధాన్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

- కల్లాల మీద ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా తగిన విధంగా భద్రపరుచుకోవాలి.
- నూర్చిన ధాన్యం 2–3 రోజులు ఎండబెట్టడానికి వీలు కాకపోతే కుప్పలతో గింజ మొలకెత్తడమే కాక రంగు మారి చెడు వాసన వస్తుందని ఇలాంటి పరిస్థితుల్లో నష్టాన్ని నివారించడానికి ఒక క్వింటాలు ధాన్యానికి ఒక కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊక కలిసి ధాన్యం పోగు పెట్టడం వల్ల గింజ మొలకెత్తకుండా, చెడిపోకుండా నివారించుకోవచ్చు. ఎండ కాసిన తరువాత ధాన్యాన్ని ఎండబోసి తూర్పారబట్టి నిలువ చేసుకోవాలి.
- రంగు మారి తడిచిన ధాన్యం పచ్చి బియ్యం కంటే ఉప్పుడు బియ్యంగా అమ్ముకోవడం వల్ల నష్టాన్ని కొంత వరకు తగ్గించుకోవచ్చు.

పాలు పోసుకునే దశ..

ఈ దశలో 2 నుంచి 3 రోజుల కన్నా ఎక్కువగా పంట నీటి మునిగితే పిండి పదార్థాలు గింజలలో చేరక గింజ బరువు తగ్గి రంగు మారి, తద్వారా దిగుబడి,నాణ్యత తగ్గుతాయి. గింజ రంగు మారకుండా ఉండేందుకు లీటరు నీటికి ఒక గ్రాము కార్బెండిజం లేదా రెండు గ్రాముల కార్బెండిజం + మాకోజెబ్ లేదా 1 మిల్లీలీటరు ప్రోఫికోనజోల్ మందును పిచికారీ చేయాలి.

కంది..

- పొలంలో మురుగునీటిని వీలైనంత త్వరగా బయటికి పంపించాలి.
- లీటరు నీటికి 10 గ్రాములు 19. 19. 19 లేదా పొటాషియం నైట్రేట్ పిచికారీ చేయాలి.

మినప, పెసర..

- ఇనుప ధాతు లోపం గుర్తించినప్పుడు లీటర్ నీటికి ఐదు గ్రాములు అన్నభేది, 0.5 గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి పిచికారీ చేయాలి.

పైరు త్వరగా కోలుకోవడానికి లీటర్ నీటికి 20 గ్రాముల యూరియా ద్రావణాన్ని పిచికారీ చేయాలి. అలాగే లీటర్ నీటికి 10 గ్రాముల 19.19.19 లేదా పొటాషియం నైట్రేట్ పిచికారీ చేయాలి.

శనగ పంటలకు..

- శనగ పంటలో పంట నీట మునిగినప్పుడు మురుగునీరు తీసివేసి సాఫ్ట్ 2.5 గ్రాము లేదా డబ్బు కొనజోల్ 1ఎంఎల్ లేదా హెక్సా కొనజోల్ 2 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయడం వలన బ్యాక్టీరియా ఎండు తెగులు, వడ తెగులు రాకుండా పంటను కాపాడుకోవచ్చు.
- కోతకు వచ్చిన పంట మనుషుల ద్వారా కోతలు చేయడం ప్రస్తుతానికి వాయిదా వేయడం మంచిది లేదా మిషన్ ద్వారా కోత కోసి ఒకే రోజులో ధాన్యం ఇంటికి చేర్చేందుకు వీలైతే పంటకోత చేపట్టవచ్చు.

రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో రిమ్స్ వైద్యుల ఘన విజయం



డాక్టర్ మనోజ్, డాక్టర్ ప్రతాప్ రెడ్డిలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ

కడప అర్బన్ : రాష్ట్ర స్థాయి డాక్టర్ల షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో కడప రిమ్స్‌కు చెందిన ఇరువురు డాక్టర్లు ఘన విజయం సాధించారు. కేఎస్ఆర్ఎం కాలేజీలోని కేఎస్ఆర్ స్పోర్ట్స్ ఎరీనాలో ఆదివారం టోర్నమెంట్ జరిగింది. ప్రొద్దుటూరు, కడప డాక్టర్ల మధ్య పోటాపోటీగా సాగిన ఈ టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతిని డాక్టర్ వెంకట మనోజ్ (సివిల్ అసిస్టెంట్ సర్జన్ పెథాలజీ విభాగం), డాక్టర్ శ్యాంసుందర్‌రావు (రేడియాలజిస్ట్) సాధించారు. మూడవ బహుమతిని డాక్టర్ ప్రతాప్‌రెడ్డి (ఈఎన్‌టీ అసిస్టెంట్ ప్రొఫెసర్), డాక్టర్ జావేద్ (ఎమర్జెన్సీ మెడిసిన్) సాధించారు. వైద్య రంగంలో ఎంత బిజీగా ఉన్నా ఆటల్లో మేటిగా రాణిస్తున్న వైద్యులను అడిషనల్ డీఎంఈ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. విజయభాస్కర్‌రెడ్డి అభినందించారు.